క్లుప్తంగా

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన తరగతులు


గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు

ఏలూరు టౌన్ : స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు 32వ రోజు బుధవారం సందడిగా కొనసాగాయి. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. పుస్తక పఠనంలో భాగంగా రిసోర్స్ పర్సన్ డి.శ్రీవల్లి దేశ నాయకుల జీవిత చరిత్రలు, కథలు చదివించారు. యోగా మన శరీరానికి మానసిక ప్రశాంతత ఇస్తుందని అన్నారు. అనంతరం స్వర్ణాంధ్ర 2047 అనే అంశంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. శిక్షణ తరగతులను డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లైబ్రేరియన్ సందీప్‌కుమార్, ఎండీ అస్లాం పాషా, ఎం కనకదుర్గ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ ప్రాజెక్టుల గేట్లు పటిష్టతపై సమీక్ష

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాలోని అన్ని ప్రాజెక్టు గేట్లు పనిచేసే స్థితిలో ఉన్నదీ లేనిదీ తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలని ఇరిగేషన్ ఇంజినీర్లను కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. బుధవారం జిల్లాలోని తమ్మిలేరు, ఎర్ర కాలువ, కొవ్వాడ కాలువ, మూడు ప్రాజెక్టులకు సంబంధిత ఇరిగేషన్ ఇంజినీర్లతో కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఉప్పుటేరును ఏలూరు ఇరిగేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీరు అటవీశాఖ, ఆర్డీఓలతో కలిసి తనిఖీ చేయాలన్నారు. తమ్మిలేరు తూర్పు, పశ్చిమ ప్రాంతాల్లో తూడును వారం రోజుల్లోపు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈని కలెక్టర్ ఆదేశించారు. గత సెప్టెంబరులో వరదలు సంభవించి నూజివీడు నగర పరిధిలోని మైనర్ ఇరిగేషన్ ట్యాంకులపై సంభవించిన గండ్లను నాణ్యతతో పూడ్చివేయాలని విజయవాడ ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈని ఆదేశించారు. విజయవాడ ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ ఆర్ మోహన్‌రావు మాట్లాడుతూ నూజివీడు నగర పరిధిలోని మొగల్ చెరువు కాలువలు ఆక్రమణ వల్ల ఇరుకుగా మారి ఇళ్ల ముంపుకు కారణమవుతుందన్నారు. ఆక్రమణలు తొలగింపుకు నూజివీడు సబ్ కలెక్టర్‌తో కలిసి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. సమావేశంలో ఏలూరు, విజయవాడ ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈలు నాగార్జునరావు, ఆర్ మోహన్‌రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు సీహెచ్ దేవప్రకాష్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు వై.అర్జునరావు, డిప్యూటీ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

కూటమి సర్కారు దగా పాలన

- వెన్నుపోటు దినంగా పాటిస్తూ నిరసన
- ఏలూరులో భారీగా నిరసన ప్రదర్శన
- పోలీస్ ఆంక్షలతో ఇబ్బందులు


ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పార్టీ ఇన్‌చార్జి జేపీ, నాయకులు


కలెక్టరేట్‌లో డీఆర్‌ఓకు వినతిపత్రం అందిస్తున్న పార్టీ పరిశీలకులు రవీంద్రనాథ్, ఇన్‌చార్జి జయప్రకాష్, నగర అధ్యక్షుడు శ్రీనివాస్, కార్పొరేటర్ విజయనిర్మల, బీసీ సెల్ నేత చిరంజీవి




నిరసన వ్యక్తం చేస్తున్న కార్పొరేటర్ జిజ్జువరపు విజయనిర్మల, మహిళా నాయకులు, కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

ఏలూరు టౌన్: టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అధికారం చేపట్టి ఏడాది పాలనలో రాష్ట్ర ప్రజలను దగా చేసిందని, సూపర్ సిక్స్ హామీలు గాలికి వదిలేసి, రాజ్య హింసను ప్రోత్సహిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోందని, పేద, మధ్య తరగతి వర్గాల ప్రజల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయని వైఎస్సార్ సీపీ ఏలూరు పార్లమెంట్ పరిశీలకులు వంకా రవీంద్ర, ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఏలూరులో కూటమి ఏడాది పాలనలో ప్రజలను మోసం చేసిన తీరుపై బుధవారం వెన్నుపోటు దినంగా పాటిస్తూ నగరంలో భారీ నిరసన ప్రదర్శన చేశారు. తొలుత సీఎస్ఐ చర్చి సమీపంలోని పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎన్ఆర్‌పేట మీదుగా జిల్లా పరిషత్ కార్యాలయం రోడ్డు, కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద కొద్దిసేపు రోడ్డుపై బైఠాయించారు. కలెక్టరేట్‌కు వెళ్లి డీఆర్వోకు వినతిపత్రం అందజేశారు.

పోలీస్ ఆంక్షలు

ఏలూరు నియోజకవర్గంలో చేపట్టిన వెన్నుపోటు దినం ర్యాలీకి పోలీస్ అధికారులు అడ్డంకులు సృష్టించారు. పార్టీ సమన్వయకర్త జయప్రకాష్ ఆధ్వర్యంలో చేపట్టిన మోటారు సైకిల్ ర్యాలీకి పార్టీ నేతలు, యువత పెద్ద సంఖ్యలో పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. ర్యాలీకి పోలీస్ అధికారులు అనుమతి ఇవ్వలేదు. పార్టీ కార్యాలయం వద్ద బందోబస్తు పేరుతో పోలీస్ సిబ్బందిని నియమించారు. వందలాది మంది పార్టీ నేతలు, యువతను ర్యాలీగా వెళ్లకుండా 20 మంది, 30 మందిని వేర్వేరుగా వెళ్లేలా పోలీసులు ఆంక్షలు పెట్టారు. వందలాది మంది ర్యాలీ చేస్తే ప్రభుత్వంపై వ్యతిరేకత ప్రజల్లోకి వెళుతుందనే భయంతో కూటమి ప్రభుత్వం ముందుగానే రాష్ట్ర వ్యాప్తంగా అనుమతులు నిరాకరించింది. ర్యాలీ చేస్తే అరెస్టులు చేస్తామంటూ బెదిరింపులకు దిగటం గమనార్హం. శాంతియుతంగా ర్యాలీ చేసేందుకు సైతం పోలీస్ అధికారులు అనుమతి నిరాకరించటంపై అసంతృప్తి వ్యక్తం అవుతోంది.

సూపర్ 6 అమలులో ఘోర వైఫల్యం

2024 ఎన్నికల్లో ప్రజలకు సూపర్ 6 హామీలంటూ నమ్మించి, అధికారం చేపట్టిన అనంతరం కూటమి ప్రభుత్వం దారుణంగా మోసం చేసి వెన్నుపోటు పొడిచిందని పార్టీ సమన్వయకర్త జయప్రకాష్ ధ్వజమెత్తారు. సీఎం చంద్రబాబు ప్రతినెలా పెన్షన్ రూ.4 వేలు ఇవ్వటమే సంక్షేమంగా ఫీలవుతున్నారని, గతంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.3 వేలు ఇచ్చేవారనే విషయం మర్చిపోయారా ? అని ప్రశ్నించారు. ఏడాది పాలనలో రైతులు, మహిళలు, విద్యార్థులు, యువత, నిరుద్యోగులను ఇలా అన్ని వర్గాల వారినీ మోసం చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదే అని విమర్శించారు. తల్లికి వందనం అంటూ మహిళలను మోసం చేస్తే, రైతు భరోసా, పంటకు గిట్టుబాటు ధర కల్పించకుండా రైతన్న నడ్డివిరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. యువతకు ప్రతి ఏటా నాలుగు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని కల్లబొల్లి కబుర్లు చెప్పి, అధికారంలోకి వచ్చాక నేటికి మూడు లక్షల ఉద్యోగాలు తొలగించి ఉపాధి లేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 వేస్తామని నమ్మించి మోసం చేశారని తెలిపారు.

కార్యక్రమంలో పార్టీ ఏలూరు నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాసరావు, వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంటా మోహనరావు (జీఎంఆర్), కార్పొరేటర్లు జిజ్జువరపు విజయనిర్మల, డింపుల్‌జాబ్, ఐనపనూరి కేదారేశ్వరి, తుమరాడ స్రవంతి, తంగెళ్ల రాము, జిల్లా అధికార ప్రతినిధి మున్నుల జాన్‌గురునాథ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నెరుసు చిరంజీవి, వైఎస్సార్ టీయూసీ జిల్లా అధ్యక్షుడు పల్లి శ్రీనివాస్, ఆర్టీఐ అధ్యక్షుడు స్టాలిన్, గ్రీవెన్స్‌సెల్ జిల్లా అధ్యక్షుడు సముద్రాల చిన్ని, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు ఎస్కే షమీం, మైనార్టీ సెల్ కార్యదర్శి ఎస్కే బాజీ, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కిలారపు బుజ్జి, వాణిజ్యసెల్ రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ల బాచి, మైనార్టీ సెల్ నాయకుడు రియాజ్ అలీఖాన్, ఎండీ ఖైసర్, జిల్లా ప్రధాన కార్యదర్శి లంకలపల్లి గణేష్, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి గాలి వెంకటేష్, బీసీ సెల్ నగర అధ్యక్షుడు కిలాడి దుర్గారావు, జిల్లా కార్యదర్శులు కంచుమర్తి తులసీ, జనార్దన్, బత్తిన మస్తాన్‌రావు, నగర యూత్ అధ్యక్షుడు గంటా సాయిప్రదీప్, ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు దేవరకొండ నాగేశ్వరరావు, సిటీ స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడు బాలాజీ, మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు ఎ.రామకృష్ణ, నగర ఆర్టీఐ అధ్యక్షుడు బల్లా రమేష్, వలంటీర్ వింగ్ నగర అధ్యక్షుడు ఉయ్యాల గణేష్, మద్దాల ఫణి, అంగన్‌వాడీ అధ్యక్షులు బుజ్జమ్మ, సిటీ కల్చరల్ వింగ్ అధ్యక్షుడు మేతర సురేష్‌బాబు, సోషల్ మీడియా అధ్యక్షుడు పచ్చిపులుసు సృజన్, ఐటీ వింగ్ అధ్యక్షుడు సత్యదేవ్, నగర దివ్యాంగుల వింగ్ బత్తిలి నాగేశ్వరరావు, సిటీ డాక్టర్స్ వింగ్ కొవ్వాడ దుర్గారావు, మేధావుల విభాగం జిల్లా అధ్యక్షుడు లక్కల బత్తిన ఏసుపాదం, నగర అధ్యక్షుడు బత్తుల ప్రభాకర్, లీగల్ సెల్ అధ్యక్షులు ప్రత్తిపాటి తంబి, జేసీఎస్ మాజీ కన్వీనర్ వైఎస్వీ శివరావు, ఎస్సీ సెల్ నాయకులు బండ్లమూడి సునీల్, నేతల కిట్టు తదితరులు ఉన్నారు.

హోరెత్తిన జగన్ నినాదం

జయప్రకాష్ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. యువత మోటారు సైకిళ్లపై పార్టీ జెండాలు రెపరెపలాడిస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్లకార్డులపై ప్రదర్శించారు. ఏలూరు నగరంలో జై జగన్ నినాదాలతో హోరెత్తించారు. కూటమి పాలనపై చేపట్టిన పోరుతో పార్టీలో నూతన ఉత్సాహం నెలకొంది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉంటే, నేటి కూటమి ప్రభుత్వ పాలనతో ప్రజలు ఉపాధి కరువై కుటుంబాలు రోడ్డున పడే దుస్థితి ఏర్పడిందని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్లాస్టిక్ అనర్థాలపై కళాజాత


ఏలూరు ఆర్టీసీ బస్టాండ్‌లో కళా బృందాల ప్రదర్శన

ఏలూరు టౌన్: ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆదేశాల మేరకు ఏలూరు కాలుష్య నియంత్రణ మండలి రీజనల్ ఆఫీస్ పర్యవేక్షణలో పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ప్రజలకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలపై కళాబృందాలు ప్రదర్శనలు నిర్వహించాయి. ఏలూరు కొత్త బస్టాండ్ సెంటర్, ఎఫ్‌సీఐ గోడౌన్స్‌లో ఎం ప్రశాంత్‌కుమార్ కళాకారులతో కళాజాత నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం, పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కళాజాత బృందం సభ్యులు ఎం ప్రశాంత్‌కుమార్, ఎం తిరుపతి కుమార్, కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పర్యావరణ పరిరక్షణ దినోత్సవం

ఏలూరు(టూటౌన్): పర్యావరణం – పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో గురువారం 10 వేల మొక్కలు నాటాలని కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, ఇన్‌చార్జి కమిషనర్ జి.చంద్రయ్య పిలుపునిచ్చారు. బుధవారం నగరపాలక సంస్థ మినీ కాన్ఫరెన్స్ హాలులో మెప్మా సీఈఓలు, సచివాలయ సెక్రటరీలు, మున్సిపల్ కార్పొరేషన్ అన్ని సెక్షన్ల అధికారులు, ఇంజినీరింగ్ సెక్షన్ డీఈలు, ఏఈలతో సమావేశం నిర్వహించారు. పోణంగి డంపింగ్ యార్డు ప్రాంగణంలో 300 మొక్కలు నాటనున్నట్టు తెలిపారు. నగరంలో సచివాలయాల ప్రాంగణాలు, అర్బన్ హెల్త్ సెంటర్ల ప్రాంగణాలు, శ్మశాన వాటికలు, స్కూల్ గ్రౌండ్స్, డంపింగ్ యార్డులు, ముందుగా గుర్తించిన రోడ్లకు ఇరువైపుల మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి, ఎంఈ ఈ.ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	36	చిక్కుడు కాయలు	90
వంకాయలు (కాంతులు)	38	బీన్స్‌చిక్కుడు	84
వంకాయలు (తెలుపు)	38	చామదుంపలు	48
బెండకాయలు	34	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	32	కంద	--
కాకర కాయలు	46	బీట్‌రూట్	36
బీరకాయలు	40-48	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	--	ఫ్రెంచ్‌బీన్స్	--
క్యాబేజీ	22	అల్లం	60
క్యారెట్	36-40	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	28	పాలకూర	12
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	24	చుక్కకూర	12
గోరుచిక్కుడు	44	గోంగూర	07-10
దోసకాయలు	20	పుదీనా	05
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20	చిలకదదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	28
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	26
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	33
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	16
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	23
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	13
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	04
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	00
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	14
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	09
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	15
ఏలూరు - తిరుపతి	16.00	4830	27

డీసీఎంఎస్ చైర్మన్‌గా చాగంటి ప్రమాణస్వీకారం


ప్రమాణస్వీకారంలో మాట్లాడుతున్న డీసీఎంఎస్ చైర్మన్ మురళీకృష్ణ

ఏలూరు టౌన్ / ఏలూరు రూరల్ : డీసీఎంఎస్ చైర్మన్‌గా చాగంటి మురళీకృష్ణ (చిన్ని) ప్రమాణస్వీకారం చేసి, పదవీ బాధ్యతలు చేపట్టారు. ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్‌లోని డీసీఎంఎస్ గ్రాండ్ కన్వెన్షన్ హాలులో ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్, టీడీపీ ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, పత్సమట్ల ధర్మరాజు, ఆరిమిల్లి రాధాకృష్ణ, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్ని మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉంటూ లాభసాటి వ్యవసాయాన్ని అందించి, రైతు సంక్షేమానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు. జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీకి పూర్వ వైభవం తీసుకువస్తానని చెప్పారు.

విస్తరిస్తున్న క్యాన్సర్ మహమ్మారి

కొయ్యలగూడెం: భవిష్యత్తులో ప్రపంచంలోనే సగం మందికి వివిధ రకాల క్యాన్సర్ సంబంధిత వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉందని రాజమండ్రికి చెందిన ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ నాగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం కమ్యూనిటీ పారా మెడిక్స్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ అసోసియేషన్, పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ల్యాండ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన క్యాన్సర్ అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. క్యాన్సర్ నివారణకు ప్లాస్టిక్ రహిత సమాజం ఏర్పడాలన్నారు. క్యాన్సర్‌ను గుర్తించడం వల్ల ప్రాణాపాయ పరిస్థితుల నుంచి రక్షించుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆనందం సుబ్బారావు, కార్యదర్శి మురళీ సతీష్, నాగేశ్వరరావును సత్కరించారు.

సుంకం తగ్గింపుతో రైతులకు నష్టం



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా నాయకులు

ఏలూరు(టూటౌన్): ఆయిల్‌పామ్ సాగులో దేశంలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉందని, ముడి పామోలిన్‌పై దిగుమతి సుంకం భారీగా తగ్గించడం వల్ల ఆయిల్‌పామ్ గెలల ధర భారీగా తగ్గిపోతుందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ జిల్లా నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం ఏలూరు అన్నే భవనంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు అధ్యక్షత నిర్వహించారు. జిల్లాలోని పలు రైతాంగ సమస్యలపై చర్చించి తీర్మానాలను ఆమోదించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పామాయిల్ దిగుమతి సుంకం 20 శాతం నుంచి 10 శాతానికి తగ్గించడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. టన్ను ఆయిల్‌పామ్ గెలల ఉత్పత్తికి రూ.22 వేలు ఖర్చవుతుందని, 2017లోనే కేంద్రం ధరల నిర్ణాయక సంఘం (సీఏసీపీ) టన్ను గెలలకు ఉత్పత్తి ఖర్చు రూ.10,035 లెక్క వేయగా ఎనిమిదేళ్లలో మరో రూ.12 వేలు పెరిగిందని తెలిపారు. ప్రస్తుతం ధర రూ.20,290 నుంచి రూ.18,850 తగ్గిందని, ఈ ధర మరో రూ.2 వేలు పైగా తగ్గే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉత్పత్తి ఖర్చులు కూడా రాక నష్టపోతున్న ఆయిల్‌పామ్ రైతులు మరిన్ని నష్టాల్లో కూరుకుపోతారని వివరించారు. ఆయిల్ పామ్ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.

పొగాకు కిలో రూ.400 ధర ఇవ్వాలి

వర్జీనియా పొగాకు రైతులకు కంపెనీలు పొగ పెడుతున్నాయని విమర్శించారు. ప్రస్తుతం వస్తున్న ధరలు ఉత్పత్తి ఖర్చులు కూడా రాని పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. కిలో పొగాకుకు ప్రస్తుతం సరాసరి ధర రూ.270 మాత్రమే వస్తోందన్నారు. సరాసరి ధర కిలోకు రూ.400 ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఆక్వా రైతులను ఆదుకోవాలి

రొయ్యల ధరలు పడిపోవడంతో రొయ్యల రైతులు నష్టపోతున్నారని చెప్పారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల ప్రకటనతో రొయ్యల రైతులు సంక్షోభంలో కూరుకుపోయారన్నారు. రొయ్యలకు గిట్టుబాటు ధర కల్పించి రొయ్యల రైతులను ఆదుకోవాలని కోరారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సిరిబత్తుల సీతారామయ్య, జిల్లా సహాయ కార్యదర్శి కోన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై టీవోటీ శిక్షణ



టీవోటీ శిక్షణలో పాల్గొన్న అధికారులు

ఏలూరు(మెట్రో): ప్రకృతి వ్యవసాయానికి విస్తృత ప్రచారం కల్పించి, అందుకు అవసరమైన శిక్షణ అందించేందుకు కృషిచేయాలని ఆర్‌వైఎస్ఎస్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయకుమార్ అన్నారు. ఏలూరు జిల్లా వ్యవసాయ కార్యాలయంలో బుధవారం ప్రకృతి వ్యవసాయంపై ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ (టీవోటీ) కార్యక్రమం వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్‌తో కలిసి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ప్రచారం, వ్యవహారస్థాయిలో అమలును బలోపేతం చేయడానికి రైతు సేవా కేంద్రం ప్రతినిధులకు టీవోటీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రకృతి వ్యవసాయం శాస్త్రీయ సూత్రాలు, మొక్కల వృద్ధి శాస్త్రం, ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ ప్రాముఖ్యతను వివరించారు. పీఎండీఎస్ వల్ల వేరుల అభివృద్ధి, సూక్ష్మ జీవుల పెరుగుదల, నేల ఆరోగ్యం మెరుగు వంటి అంశాలు సహజ వ్యవసాయ విజయానికి కీలకంగా నిలుస్తాయని వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా రైతులలో ప్రకతి వ్యవసాయం పట్ల అవగాహన పెంపొందించడం, రసాయన పద్ధతుల నుంచి ప్రకృతి వ్యవసాయానికి మార్పును ప్రోత్సహించడం వంటి లక్ష్యాలను నిర్దేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి హబీబ్ బాషా, డీపీఎం బి.వెంకటేష్, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

హరిత ఏలూరు జిల్లా లక్ష్యం

ఏలూరు(మెట్రో): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో 4.50 లక్షల మొక్కలు నాటాలన్నది లక్ష్యమని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ బంగ్లా నుంచి ప్రపంచ పర్యావరణ దినోత్సవం రోజున మొక్కలు నాటే కార్యక్రమంపై వివిధ శాఖల జిల్లా అధికారులు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, ఇరిగేషన్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఈవోపీఆర్డీఓలతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ఈనెల 5న చేపట్టనున్న వనం - మనం కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులను, స్వచ్ఛంద సంస్థలను అన్ని వర్గాలను భాగస్వాములను చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. మొక్కలు నాటేందుకు అవసరమైన గుంతలు, ట్రీ గార్డులను సిద్ధం చేసుకోవాలన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో జేసీ పి.ధాత్రిరెడ్డి, డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, అటవీశాఖ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

7న బీసీల సదస్సు

ఏలూరు రూరల్ : ఈ నెల 7న ఉదయం 10 గంటలకు ఏలూరు ఏటిగట్టు వద్ద యాదవ సంక్షేమ సంఘం భవనంలో బీసీల అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు ఆంధ్రప్రదేశ్ బీసీ కులాల ఐకాస ప్రధాన కార్యదర్శి మార్గాని శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో 3 కోట్ల మంది బీసీలు బలమైన సామాజిక వర్గంగా ఉన్నప్పటికీ ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలతో పాటు అనేక రంగాల్లో వెనకబడి పోయారని పేర్కొన్నారు. ఈ అంశంపై ఇప్పటికే ఏలూరు నగరంలోని 20 కులాల నాయకులతో చర్చించామని తెలిపారు. బీసీల్లో చైతన్యం తీసుకొచ్చి, కులాల వారీగా సమస్యలపై చర్చించేందుకు సదస్సు ఏర్పాటుచేశామని వివరించారు. అనంరతం బీసీల సంక్షేమం కోసం యాక్షన్ ప్లాన్ రూపొందించి అమలు చేస్తామని, బీసీ సంఘాల నాయకులు, ప్రతినిధులంతా హాజరుకావాలని కోరారు.

ప్రజా సమస్యలపై దరఖాస్తుల స్వీకరణ


సమస్యలపై దరఖాస్తులు స్వీకరిస్తున్న పీఓ

బుట్టాయగూడెం: మండలంలోని కేఆర్‌పురం ఐటీడీఏలో బుధవారం ఐటీడీఏ పీఓ కె.రాములు నాయక్ పలు సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. తమ గ్రామానికి కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి కృషి చేయాలని బుట్టాయగూడెం మండలం కేఆర్‌పురం సర్పంచ్ ఉయికే బొజ్జి ఆధ్వర్యంలో గిరిజనులు పీఓకు వినతిపత్రం అందజేశారు. కేఆర్‌పురం పంచాయతీ పరిధిలో పోడు వ్యవసాయం చేసే అర్హులైన 170 మంది గిరిజనులకు పట్టాలివ్వాలని కోరారు. పలు గిరిజన మండలాల నుంచి పలు వినతిపత్రాలను పీఓకు అందజేశారు.

మోటార్ సైకిల్ చోరీ

జంగారెడ్డిగూడెం: వేగవరం పడమటి వీధికి చెందిన బల్లే శ్రీను ఈ నెల 3న సాయంత్రం తన మోటార్ సైకిల్‌ను ఇంటి ముందు పార్క్ చేసి లోపలికి వెళ్లి తిరిగి వచ్చి చూసేసరికి కనిపించలేదన్నారు. బుధవారం శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్సై షేక్ జబీర్ తెలిపారు.